ప్రజాశక్తి

బుధవారం 5 నవంబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



బండ్లమూడిలో బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు


దళితులపై దాడి అత్యంత హేయం

- దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి..
- బాధితులకు న్యాయం చేయాలి...
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్.కె. మాబు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

చీమకుర్తి మండలం, బండ్లమూడి దళితులపై దాడి అత్యంత హేయమైన చర్య అని, ఈ దాడిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నట్లు పార్టీ కార్యదర్శి ఎస్కె.మాబు ప్రకటించారు. మంగళవారం నాడు మాబు ఆధ్వర్యంలో పార్టీ బందం ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించింది. గ్రామంలో ఆధిపత్య వర్గానికి చెందిన ఒనిపెంట శ్రీనివాసులురెడ్డి, గోపిరెడ్డి బాలఓబుల్‌రెడ్డి సమక్షంలో వారి అనుచరులు మూకుమ్మడిగా దళితులపై పోలీసుల సమక్షంలో విచక్షణా రహితంగా ▶ 2లో

పొగాకు కిలో రూ.355



- వేలం ముగిసే సమయంలో గరిష్ట ధర పెంపు
- సగటు ధర రూ.153.11 మాత్రమే..
- ధరల్లేక..పంటపై ఆసక్తి లేక.. నాట్లు వేయని రైతులు
- ఇప్పటివరకూ 10,930 ఎకరాల్లో పొగాకు సాగు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పొగాకు కిలో రూ.355 ధర పలికింది. ఇది రైతులకు వరం కాదు. వ్యాపారుల వ్యూహాత్మకం. వేలం ముగిసే దశలో వ్యాపారులు ఇంత ధర ఇవ్వడానికి కారణాలున్నాయి. పొగాకు సాగు గణనీయంగా తగ్గడమే. వాతావరణం అనుకూలంగా లేక కొంత.. వ్యాపారుల దోపిడిని తట్టుకోలేక ఇపుడు పొగాకు నాట్లు వేయడానికి కూడా రైతులు ముందుకు రావడం లేదు. ఈ తరుణంలో ఈ ధర ఇచ్చారంటే రైతులను మభ్యపెట్టడానికే.! మళ్లీ సాగును పెంచడానికేనని రైతులకు చెప్పాల్సిన అవసరం లేదు. ఇదే వ్యాపారుల ఎత్తుగడ. పొగాకు గిట్టుబాటు ధరల్లేక మొన్నటి వరకూ రైతులు వేలం కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టారు. నిత్యం 30 శాతం బేళ్లను తిరస్కరించారు. రైతులు విసుగెత్తి వేసాగారు. దీంతో ఈ ఏడాది పొగాకు పంటపై ఆసక్తి లేకుండా పోయింది. మళ్లీ సీజన్ వచ్చినా పొగాకు కొనుగోళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ పాటికే పొగాకు నాట్లు వేస్తారు. సెప్టెంబరులోనే నాట్లు మొదలవుతాయి.

ఈ ఏడాది వర్షాలు సకాలంలో లేకపోవడంతో పాటు ఇప్పటి పండించిన పొగాకు కొనడం కష్టంగా మారింది. ధరల్లేక రైతులు నష్టాల్లోకి వెళ్లారు. దీంతో ఇప్పుడు పొగనాట్లు వేయాలన్నా సంసిద్ధంగా లేరు. సీజన్‌లో లక్షన్నర ఎకరాల్లో పొగాకు వేస్తారు. ఇప్పటి వరకూ 10,930 ఎకరాల్లో ▶ 2లో



మూసేసిన సూర్యలంక బీచ్

బీచ్..క్లోజ్..

- కార్తీక మాస స్నానాలకు భక్తులు రావద్దంటున్న అధికారులు
- తీరం వెంట కోతకు గురైన రహదారి

▲ 8లో



కాకుటూరివారిపాలెంలో రెండు గ్రూపులతో మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

కాకుటూరివారిపాలెంలో ఉద్రిక్తత

- సర్పంచ్ వర్గీయులు టార్గెట్ చేశారని దళితుల ఆరోపణ
- ఆందోళనకు దిగిన దళితులు..
- గ్రామాన్ని సందర్శించి.. చర్చలు జరిపిన అధికారులు

▲ 8లో

ఏఎంఆర్ సమస్య పరిష్కారానికి కమిటీ

- రాష్ట్ర మంత్రులతో ఫ్యాక్టరీ యజమానుల భేటీ
- రాయల్టీ వసూలులో సానుకూల నిర్ణయం తీసుకుంటాం..
- మంత్రి కొల్లు రవీంద్ర



మంత్రులతో భేటీ అయిన ఫ్యాక్టరీ యజమానులు

ప్రజాశక్తి-చీమకుర్తి

గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులకు మరియు ఏఎంఆర్ ప్రైవేట్ సంస్థకు రాయల్టీ వసూలులో ఏర్పడిన ప్రతిష్టంభన తొలగించే విధంగా కమిటీ ఏర్పాటయింది. మంగళవారం అమరావతి సచివాలయంలో భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయ స్వామి, ప్రభుత్వ సెక్రటరీ మీనా, డిఎం జి.చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు బిఎన్.విజయ్ కుమార్, ఏలూరి సాంబశివరావు, ఏఎమ్ఆర్ సంస్థ ప్రతినిధులు, మార్టూరు, చీమకుర్తి ఏరియాల ఫ్యాక్టరీ యజమానుల సంఘాల నాయకులతో జరిగిన సుదీర్ఘ సంయుక్త సమావేశం పలు అంశాలను చర్చించింది. ఫ్యాక్టరీ యజమానులు పలు సమస్యలు సమావేశం దష్టికి తెచ్చారు. ఒక మీటరు ముడిరాయికి 350 అడుగులు నుంచి 450 అడుగులకు పెంచమన్నారు. మైనింగ్ బిల్లులు కట్టాక ఒక నెల నుంచి మూడు నెలల వరకు బిల్లులు తెచ్చుకునే విధంగా అనుమతి ఇవ్వాలని కోరారు. క్వారీల కంటే ఫ్యాక్టరీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నందున బిల్లులు దొరకడం కష్టంగా ఉందని పేర్కొన్నారు. ఏఎమ్ఆర్ సంస్థ వచ్చాక సమస్యలు ఎక్కువయ్యాయని, ఫ్యాక్టరీ నడపలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. యజమానులు చెప్పిన సమస్యలన్నీ సమావేశంలో అధికారులు, మంత్రులు పూర్తిగా విన్నారు. ఈ సందర్భంగా భూగర్భల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఏఎమ్ఆర్ సంస్థ వచ్చాక ఏర్పడ్డ సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులతో, ఫ్యాక్టరీ యజమానులతో, ఏఎంఆర్ ప్రతినిధులతో కమిటీని మంగళవారం సాయంత్రానికే వేస్తామని పేర్కొన్నారు. ఆ కమిటీ వారంలోపు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో, గుంటూరు జిల్లాలో పర్యటించి సమస్యలపై ఒక నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. నివేదిక వచ్చాక తగు నిర్ణయాన్ని ప్రకటిస్తామని తెలిపారు. సీనరీ చెల్లింపు విషయంలో సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వానికి, ఇటు పరిశ్రమ యజమానులకు ఎలాంటి నష్టం లేకుండా చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మైనింగ్ జేడీ, జిల్లా డిఎంజిఓ, రాయల్టీ వసూలు సంస్థ ప్రతినిధి, ప్రతి అసోసియేషన్ నుంచి ఇద్దరు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చీమకుర్తి ప్రాంత ఫ్యాక్టరీ యజమాని సంఘాల ▶ 2లో

'చెకుముకి' సంబరాలు విజయవంతం

- విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన పెంపొందించాలి..
- జెవివి పిలుపు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జిల్లావ్యాప్తంగా జనవిజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతంగా చేపట్టారు. ఒంగోలు, శింగరాయకొండ, కొండపి, టంగుటూరు, చీమకుర్తి, పొదిలి, కనిగిరి, పామూరు, మార్కాపురం, వైపాలెం, గిద్దలూరు, కంభం తదితర మండలాల్లో ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. దాదాపు 400 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థి బందాలు పాల్గొన్నాయి. సెప్టెంబర్ 18న పాఠశాల స్థాయిలో జరిగిన చెకుముకి సైన్స్ పరీక్షల్లో 8, 9, 10 తరగతులలో మొదటి స్థానంలో నిలిచిన ముగ్గురు విద్యార్థులతో ఏర్పడిన బందాలు మండల స్థాయిలో పోటీ పడ్డాయి. ఈ కార్యక్రమాల్లో మండల విద్యాధికారులు, వైద్యులు, ప్రధానోపాధ్యాయులు, విద్యావేత్తలు, సైన్స్ ఉపాధ్యాయులు, జెవివి నాయకులు పాల్గొని విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచన, ప్రశ్నించే తత్వం, పర్యావరణ పరిరక్షణ, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా చర్చలు జరిపి ప్రశ్నలకు సమాధానాలు రాయడం కార్యక్రమానికి చైతన్యం నింపింది. మండల స్థాయిలో విజేతలైన బృందాలకు జెవివి ప్రచురణల పుస్తకాలు, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

శాస్త్రీయ దృక్కోణం ప్రతి విద్యార్థిలో పెంపొందాలి

ఒంగోలు శ్రీ సాయిరాం జూనియర్ కళాశాలలో జరిగిన చెకుముకి సైన్స్ సంబరాలను జెవివి సీనియర్ నాయకులు ఎ.వి. పుల్లారావు ప్రారంభించారు. పిల్లల్లో శాస్త్రీయ ఆలోచన పెంపొందించాలనే లక్ష్యంతో చెకుముకి సైన్స్ సంబరాలు గత 36 సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి అన్నారు. విద్యార్థులు జీవిత సంఘటనలను తర్కబద్ధంగా విశ్లేషించి, మూఢనమ్మకాల బారిన పడకూడదని సూచించారు. జెవివి నగర ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు గారడీల మాయలో కాకుండా ▶ 2లో

పొగాకు కిలో రూ.355

(మొదటిపేజీ తరువాయి)

నాట్లు వేశారు. వర్షాలకు 2 వేల ఎకరాల్లో తోటలు నీటమునిగాయి. ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ఈ తరుణంలో ఈ ఏడాది వ్యాపారులకు అవసరమైన మేరకు పంట కూడా వచ్చేలా లేదు. దీంతో వేలం ముగిసే సమయంలో ధరలు పెంచారు. కిలోకు గరిష్టంగా రూ.351 ఇచ్చారు. అంటే ఇది వ్యూహాత్మకం. రైతుల్లో మళ్లీ ఆశలు పెంచుతున్నారు. ధరలు ఇస్తామనే సంకేతాలు ఇస్తున్నారు. ఇప్పుడు ఎంత పెంచినా రైతులకు గిట్టుబాటు ఎంత మేరకు అవుతుందన్నదే ప్రశ్న. ఎందుకంటే 80 శాతం పొగాకును కారుచౌకగా కొనేశారు. ఇప్పుడు రైతుల వద్ద చాలా తక్కువగా ఉంది. దీనికి ఎంత ధరలు ఇచ్చినా వ్యాపారులు నష్టపోయేదేమీ లేదు. పైగా గరిష్ట ధర కూడా ఐదారు బేళ్లకే ఇస్తారు. దీన్ని ప్రచారంలో పెడతారు. రైతులు మళ్లీ పొగాకు సాగుపై ఆసక్తి పెంచుకునేలా చేస్తున్నారు. రైతులను ఇలా మోసం చేయడం వ్యాపారులకు నైజంగా మారింది. ఇప్పటికే పొగాకు సాగు గడువు కూడా ముగిసింది. జనవరిలో పొగాకు క్యూరింగుకు వస్తుంది. ఇప్పటికీ నాట్లు వేయలేదు. పది శాతం కూడా సాగు జరగలేదు. రైతుల్లో దాదాపుగా పొగాకుపై ఆసక్తి తగ్గింది. పైగా బోర్డు అధికారులు ఇటీవల వేలం కేంద్రాల్లో సమావేశాలు పెట్టి పంటను తగ్గించుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలన్నారు. బోర్డు కూడా ఈ ఏడాది 140 మిలియన్ కిలోల పంటకు అనుమతి ఇచ్చింది. ఇప్పుడు నాట్లు వేసిన విస్తీర్ణం చూస్తే వ్యాపారుల అవసరాలు తీరడం కష్టం. ప్రారంభంలో వేలం కేంద్రాలను సందర్శించి హడావుడి చేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు తర్వాత ఆ అంశాన్నే వదిలేశారు. వ్యాపారుల ఇష్టారాజ్యం నడిచింది. పోటీ అనే ప్రసక్తే కనిపించలేదు. ఇచ్చిందే ధర. కొనడం కంటే తిరస్కరించడానికే ప్రాధాన్యత ఇచ్చారు. మంగళవారం నాడు వేలంలో కొనుగోళ్లను చూస్తే గరిష్ట ధర కిలోకు రూ.355 ఇచ్చారు. ఎస్ఎల్ఎస్‌లో 5574 బేళ్లురాగా 1981 బేళ్లను తిరస్కరిం చారు. ఎస్‌బిఎస్‌లో 6388 బేళ్లు రాగా 2215 బేళ్లు తిరస్క రించారు. ఇక్కడా గరిష్ట ధర రూ.355 ఉండగా సగటు ధర రూ.160.72 ఉంది. ఇక్కడా అదే తీరు నడిచింది. తిరస్కరణ బేళ్ల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే ఆరు నెలలు దాటింది. ఇంకెంతకాలం అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. మళ్లీ సీజన్ వచ్చింది. ఇంతవరకూ నాట్లు పడలేదు. దీంతో పొగాకు పంటపై గందరగోళం నెలకొంది. ప్రత్యామ్నాయంగా ఏ పంటలు వేయాలో కూడాస్పష్టత లేదు.

ఏఎంఆర్ సమస్య పరిష్కారానికి కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు కాట్రగడ్డ రమణయ్య, మార్వెల్ బుజ్జి, ఎర్రగుంట్ల శ్రీనివాసరావు, లగడపాటి శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు, మార్టూరు ఏరియా అసోసియేషన్ నాయకులు పి సురేష్, మస్తానయ్య, కష్ణ, దివ్య ప్రసాదు, గ్రోత్ సెంటర్ అసోసియేషన్ నాయకులు ఆళ్ల రవి, మండల రత్నకుమార్, రాష్ట్ర ఫ్యాక్టరీ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రమనేని కోటేశ్వరరావు, ఏఎంఆర్ సంస్థ ప్రతినిధి నాగేశ్వరరావు, పలువురు అధికారులు, ఫ్యాక్టరీ యజమానులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు వినతి

రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు చీమకుర్తి ఏరియా ఫ్యాక్టరీ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఏఎమ్ఆర్ సంస్థ వచ్చాక ఏర్పడిన గ్రానైట్ సంక్షోభం గురించి, యజమానుల సమస్యలపై నివేదికను అందజేశారు. చీమకుర్తి ఫ్యాక్టరీ యజమానుల సంఘం అధ్యక్షుడు కాట్రగడ్డ రమణయ్య మంత్రి లోకేష్‌తో ఈ విషయమై విన్నవించారు. త్వరలోనే గ్రానైట్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

చెకుముకి సంబరాలు విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

శాస్త్రీయ దక్పోణంతో ఆలోచించాలన్నారు. సాయిరాం కాలేజ్ చైర్మన్ కర్రీ అంజయ్య, ప్రిన్సిపల్ రాఘువ, జెవివి నగర అధ్యక్షులు యస్.వి. రంగారెడ్డి లు ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ప్రభుత్వ విభాగంలో బాలాజీ నగర్ ఉన్నత పాఠశాల, ప్రైవేట్ విభాగంలో నారాయణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానాలు సాధించారు. బాలికలకు జెవివి ప్రచురించిన "ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి" పుస్తకాలు బహుకరించారు. కార్యక్రమంలో జెవివి నగర కార్యదర్శి జోత్స్న, అధ్యాపకులు ఫణీంద్ర, అంజిరెడ్డి, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి అత్యంత హేయం

(మొదటిపేజీ తరువాయి)

దాడిచేస తీవ్రంగా గాయపరిచిన ఘటన పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్.కె.మాబు మాట్లాడుతూ ఆధునిక సమాజంలోనూ దళితులపై ఆటవిక దాడులు రోజురోజుకీ పెరుగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇటువంటి వరుస ఘటనలు చోటు చేసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు మాయని మచ్చ అని మండిపడ్డారు. ఈ సందర్భంగా బాధితులకు న్యాయం చేకూరే వరకు తాము అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ బందం రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.మాణిక్యారావును కలసి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పార్టీ బందం బండ్లమూడి గ్రామాన్ని సందర్శించి దాడికి గురైన కుటుంబాలను పరామర్శించి, సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దళితుల పొలంలో గొర్రెలు మేస్తున్న సమయంలోనే దాడికి పాల్పడ్డారని స్థానికులు వివరించారని వారు పేర్కొన్నారు. దళితులపై దాడులకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మాబు డిమాండ్ చేశారు. దళితులను అణచివేతల పట్ల మౌనం వహించడం కూడా నేరమేనన్నారు. ఈ సంఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి, నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేకూర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ బండ్లమూడి గ్రామాన్ని వెంటనే సందర్శించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దళితుల భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని, గ్రామంలో శాంతి భద్రతలను పటిష్ఠం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి. రఘురామ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి. బాలకోటయ్య, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బంకా సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు,డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు, సిపిఎం చీమకుర్తి మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వి. మోజేష్, టి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

బండ్లమూడిలో పోలీస్ పికెట్

చీమకుర్తి: మండలంలోని బండ్లమూడి దళిత కాలనీలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. మంగళవారం బండ్ల మూడిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, చీమకుర్తి సీఐ దాసరి ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బండ్లమూడి ఘటనపై పోలీసులు మాట్లాడుతూ ఈ గొడవ గొర్రెల వివాదం దగ్గర మొదలైందన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య వ్యక్తిగత కారణాలతో మాత్రమే జరిగిందని, రెండు కులాల మధ్య వివాదం కాదన్నారు. రెండు కేసులు విచారణలో ఉన్నాయన్నారు. తప్పుదారి పట్టించే సమాచారం, వదంతులు లేదా కుల విభేదాలు రేకెత్తించే పోస్టులు సోషల్ మీడియాలో ప్రచారం చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.



బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

గిద్దలూరు చేరుకున్న న్యాయవాదుల పాదయాత్ర

ప్రజాశక్తి-గిద్దలూరు

రాష్ట్రంలోని న్యాయవాదుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా, డోన్ పట్టణానికి చెందిన న్యాయవాదులు లక్ష్మిశెట్టి కృష్ణ ప్రసాద్, కె ఈశ్వరయ్యలు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల కోసం న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలని ఈ నెల 1వ తేదీ డోన్ నుంచి విజయవాడ సీఎం, డీసీఎం కార్యాలయాల వరకు ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నామని అందులో భాగంగా మంగళవారం గిద్దలూరు చేరినట్టు తెలిపారు. వారిని స్థానిక ప్రముఖ న్యాయవాది ఉదయగిరి మల్లిఖార్జున, ప్రజా సంఘాల నాయకులు ఆవులయ్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయవాది ఉదయగిరి మల్లిఖార్జున మాట్లాడుతూ న్యాయ వాదుల వృత్తి నిర్వహణలో అనేక సవాళ్లు, సమస్యలను ఎదుర్కొంటున్నారని, పోలీసు అధికారుల చేత న్యాయవాదు అన్యాయానికి గురవుతున్నారని, కొందరు న్యాయవాదులు తప్పుడు కేసులలో చిక్కుకుని ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు తమ ప్రాణాలు సైతం కోల్పోతున్నారని అన్నారు.

పెద్దకొత్తపల్లి వాసుల కల నెరవేరేనా..?

- 15 రోజులుగా గ్రామానికి నిలిచిన రాకపోకలు
- చిన్నపాటి వర్షానికే నేలచప్టాపై నీరు
- సగానికిపైగా కుంగిన చప్టా
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి-మద్దిపాడు

మొంథా తుఫాన్ ప్రభావం ఇప్పటికీ ఆ ఊరిని విడిచిపెట్టలేదు. ముదిగొండ వాగు ప్రవాహానికి దాదాపు 15 రోజులకు పైగా ఆ గ్రామానికి రాకపోకలు నిలిచాయి. ఇక చేసేది లేక చుట్టూ గ్రామాలు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి....ఎగువ ఉన్న గ్రామాలకు రాకపోకలు ఉన్నా ఇక్కడ మాత్రం పరిస్థితి వేరు. దానికి తోడు నేలచప్టా సగం వరకు కుంగిపోయింది. ఆ వాగుపై బ్రిడ్జి నిర్మించండి అంటూ అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. బ్రిడ్జి నిర్మాణం చేపడతారనే ఆ గ్రామస్తుల చిరకాల కోరిక కలగానే మిగిలిపోతుంది.



రోడుకు అడ్డుగా వేసిన ముళ్ల కంచె

మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి గ్రామం జాతీయ రహదారికి కిలో మీటరు పైగా దూరంలో ఉంటుంది.ఆ గ్రామం నుండి రహదారిపైకి నిమిషాల వ్యవధిలోనే రావొచ్చు. ఇక మద్దిపాడుకు అయితే పది నిమిషాలు లోపు చేరుకోవచ్చు. అలాంటిది ఇప్పుడు దాదాపు 10 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కారణం పెద్దకొత్తపల్లి గ్రామానికి ముఖద్వారాన ముదిగొండ వాగు పై ఉన్న నేలచప్టా పైన చిన్నపాటి వర్షానికే నీళు పారుతుంటాయి.ఈ క్రమంలో మొన్న మొంథా తుఫాను కారణంగా కురిసిన వర్షాలకు వాగు ఉగ్రరూపం దాల్చి గ్రామంలోకి సైతం వెళ్లగా వాగు పక్కన ఉన్న పొలాలు కూడా మునిగిపోయాయి. జాతీయ రహదారి నుండి పెద్దకొత్తపల్లి గ్రామానికి దాదాపు 15 రోజులకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. వాగు పారుతున్న నేపథ్యంలో ఎక్కడ ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు రోడ్డుకు ఇరువైపులా కంచెలు ఏర్పాటు చేశారు. తుఫాను తగ్గింది అయినా ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వర్షపు నీటి కారణంగా ఇప్పటికీ కూడా ఆ కంచెలను తొలగించకుండా ఆ రోడ్డులో అధికారులు రెవెన్యూ సిబ్బందిని కాపల ఉంచారు. ఈ క్రమంలో మద్దిపాడు రావాలంటే లింగంగుంట గ్రామం మీదగా త్రోవగుంట వచ్చి అక్కడ నుండి మరలా వెనక్కి రావాల్సి ఉంది. దాదాపు 10 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించాల్సి వస్తోంది. గురవారెడ్డిపాలెం గ్రామం పరిధిలో ఉన్న వాగు ఉధృతి తగ్గడంతో పెద్దకొత్తపల్లి వాసులు ఆ రోడ్డు మార్గం నుంచి ఇప్పుడు రాకపోకలు సాగిస్తున్నారు. అటు నుంచి రావాల్సి వచ్చిన కిలోమీటర్ల దూరం పెరుగుతోంది. ఎప్పుడో ఏర్పాటు చేసిన నేలచప్టా కావడంతో ప్రస్తుతం వర్షాల కారణంగా చప్టా బాగా దెబ్బతిని కుంగిపోయింది. నీటి ప్రవాహం తగ్గిన తరువాత ఆ రోడ్డులో కాలిబాటనో, లేక ద్విచక్ర వాహనాలు మాత్రమే పోవడానికి వీలు ఉంటుంది. కార్లు, ఇతర పెద్ద వాహనాలు ఆ గ్రామంలోకి ప్రవేశించలేవు. చప్టా కుంగడంతో కుంగిన ప్రదేశంలో కర్రలు, చీరలు కట్టారు. ఒకవేళ నడిచేవారు జాగ్రత్తగా వెళ్తారని నడిచేవారికి ఆ ముదిగొండ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆ గ్రామానికి చెందిన పలువురు అధికారులు, ఎమ్మెల్యే బిఎన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇదిగో అదిగో అంటున్నారే తప్పా ఇంత వరకు ముందు అడుగు పడలేదు. చప్టా కుంగిపోయినప్పుడు సంబంధిత శాఖ అధికారులు వచ్చి చూచి వెళ్తున్నారే గానీ ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. బ్రిడ్జి నిర్మాణం చేపడతారనే తమ చిరకాల కోరిక కలగానే మిగిలిపోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంగిన చప్టాపై రాకపోకలు సాగించడం కష్టమని వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రాకపోకలు సాగించెలాగా చూడాలని, తమ చిరకాల కోరికను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీరు

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న క్రేన్

ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-అద్దంకి

ద్విచక్రవాహనాన్ని క్రేన్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలైన సంఘటన అద్దంకి-రేణిగివరం రోడ్డులో మంగళవారం జరిగింది. పొలం పనుల కోసం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా క్రేన్ ఢీకొట్టడంతో రేబికాకుమారి (3) అక్కడికక్కడే మృతి చెందింది. అరుణ, కంకణాల వీరాంజనేయులు గాయపడగా స్థానికులు వెంటనే 108కి సమాచారం అందించడంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై అద్దంకి పోలీస్ స్టేషన్లో ఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన రేబికాకుమారి

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పంగులూరు

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం పంగులూరు మండలంలోని రామకూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ షేక్ మహమ్మద్ అలీ (40) రామకూరు సెంటర్లో షాప్ పెట్టుకుని బైక్ మెకానిక్ చేస్తు జీవిస్తున్నాడు. అతను కొత్తగా ఇల్లు కట్టుకుంటూ ఇటీవల ఇంటికి స్లాబ్ వేశారు. మంగళవారం ఉదయం ఇంటి పైకెక్కి పైపుతో ఇంటిని తడిపి చేతితో పైపులు విసరడంతో ఇంటి పక్కనే ఉన్న 11 కెవి విద్యుత్ వైర్‌కు చెయ్యి తగిలి షాక్‌కు గురై క్రింద పడిపోయాడు. వెంటనే అంబులెన్స్ ద్వారా చిలకలూరిపేటలోని డాక్టర్ ముద్దన రమేష్ హాస్పటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మహమ్మద్ అలీ తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా గ్రామంలో మంచి పేరుంది. ఆలీకి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.



మహ్మద్ అలీ(ఫైల్)

వాహనం ఢీకొని గొర్రెలు మృతి

ప్రజాశక్తి-పంగులూరు

గుర్తుతెలియని వాహ నం ఢీకొని 10 గొర్రెలు మృతి చెందిన సంఘటన జాతీయ రహదారిపై కొండమంజులూరు గ్రామ సమీపంలో మంగళవా రం సాయంత్రం జరిగింది. మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామానికి చెందిన బుర్లా రామాంజనేయులు తన గొర్రెల ను జాతీయ రహదారి గుండా తీసుకొస్తుండగా సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒంగోలు వైపు నుంచి గుంటూరు వెళుతున్న ఒక లారీ గొర్రెలను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 10 గొర్రెలు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రెండు లక్షల రూపాయల వరకు ఉంటుందని తెలిసింది. గొర్రెలను ఢీ కొట్టిన లారీ ఆగకుండా వెళ్ళిపోయింది. దీంతో గొర్రెల యజమాని రామాంజనేయులు ఆవేదన చెందారు.



మృతి చెందిన గొర్రెలు

6న రేగులచిలుకలో గ్రామసభ

ప్రజాశక్తి-సిఎస్‌పురం

సిఎస్.పురం మండలంలోని రేగులచిలుక గ్రామంలో వివాదాస్పద రిజిస్టర్లో నమోదైన భూముల సమస్యల సత్వర పరిష్కారం కోసం 6వ తేదీ ఉదయం 10 గంటలకు రేగులచిలుక గ్రామ సచివాలయంలో గ్రామ సభ ఏర్పాటు చేస్తున్నట్లు మండల తహశీల్దార్ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. భూముల యజమానులు, రైతులు, పట్టాదారులు తమ వద్ద గల హక్కు పత్రాలు సమర్పించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

ప్రజాశక్తి-దర్శి

నగదు రికవరీ ఏజెంట్లు, ఆధార్ ద్వారా నగదు తీసే ఏజెంట్లు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక పిజియన్ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోయాయని, నగదు జమ చేసే ఏజెంట్లు జాగ్రత్తల వహించాలని అన్నారు. సైబర్ నేరాలు పెరిగాయని తగ్గేందుకు అందరూ అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దర్శి సిఐ వై.రామారావు, పొదిలి సీఐ రాజేష్‌కుమార్, త్రిపురాంతకం సీఐ హసన్‌తో పాటు రికవరీ ఏజెంట్లు ఆధార్ బిజినెస్ ఏజెంట్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-పీసీపల్లి

ఎస్సై జి.కోటయ్య మంగళవారం పెద అలవలపాడు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించాలని ఆయన ఆదేశించారు. రోడ్డు నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-దొనకొండ

దొనకొండ రైల్వేస్టేషన్‌లో సమస్యలను పరిష్కారించాలని దొనకొండకు చెందిన పలువురు ప్రజలు రైల్వేబోర్డు మెంబర్ శిద్దా సూర్యకుమారికి విజ్ఞప్తి చేశారు. దొనకొండ రైల్వేస్టేషన్‌ను తనిఖీ నిమిత్తం మంగళవారం విచ్చేసిన ఆమెను దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హల్టింగ్ సమస్య పరిష్కరించినందుకు కృతజ్ఞతగా స్థానికులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారమ్స్‌పై మంచినీళ్లు రావటం లేదని, టాయిలెట్స్ సౌకర్యం లేక ప్రయాణికులు, ముఖ్యంగా మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు ఎంతో ఉపయోగపడే ధర్మవరం, షిరిడి సాయి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దొనకొండలో హల్టింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆమె వచ్చే నెలలో ఢిల్లీలో జరిగే సమావేశంలో రైల్వే ఉన్నతాధికారులతోపై సమస్యలు చర్చించి పరిష్కారంకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అమృత భారత్ పథకంలో భాగంగా దొనకొండ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు నత్తనడకన జరుగుతున్నాయని ప్రజలు ఫిర్యాదు చేయగా ఒంగోలు ఎంపితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం భారత ప్రభుత్వం శిద్దా సూర్యకుమారీ ఫొటోతో రూపొందించిన స్టాంప్‌ను ఆమె చూపించగా ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రొడ్డారామయ్య, వెంకటరామయ్య, బత్తుల శ్రీను, రిటైర్డ్ రైల్వే పింఛనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బి.జయరాజ్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు హనుమంతు, రమేష్, చలపతి పాల్గొన్నారు.



శిద్దా సూర్యకుమారితో గ్రామస్తులు



చెరువును పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

మోపాడు రిజర్వాయర్ పరిశీలన

ప్రజాశక్తి-పామూరు

మోపాడు ఆయుకట్టు చెరువును రైతు సంఘ నాయకులు పరిశీలించారు. మోపాడు ఆయుకట్టు చెరువు మరమ్మతులు జరుగుతున్నాయి. వర్షాలు కురిసి చెరువులోకి నీళ్లు వచ్చిన సమయంలో మరమ్మత్తులు పనులు చేయటం వలన రైతుల పైర్లు వేసుకోవడానికి ఆటంకంగా ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జయంతి బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, మద్దిశెట్టి ప్రసాదు, వ్యవసాయ కార్మికుల నాయకులు కె.మాల్యాద్రి, వీరనారాయణ పాల్గొన్నారు.

భైరవకోనలో ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-సిఎస్‌పురం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో కార్తీక పౌర్ణమి ఏర్పాట్లను ఒంగోలు దేవాదాయ ధర్మాదాయశాఖ ఏసీ పాన కాలరావు, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణలు మంగళవారం పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరి వెంట ఇఓ వంశీకష్ణారెడ్డి, ముప్పాళ్ళ శ్యామ్ సుందర్‌రాజు, జి.వెంకటరామరాజు, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వరనాయక్ ఉన్నారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు



సైనిక లాంఛనాలతో నిర్వహిస్తున్న అంత్యక్రియలు

హవల్దార్ భూతేశ్వరుడుకి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

ప్రజాశక్తి-కొమరోలు : మండలంకు చెందిన జవాన్ బొంత భూతేశ్వరుడు(42)కు మంగళవారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. ఇతను రాజస్థాన్‌లో ఆర్మీ ఉద్యోగంలో హవల్దారుగా విధులు నిర్వహి స్తూ హార్ట్ ఎటాక్‌తో ఈ నెల 1వ తేదీ మరణించినట్లు తోటి జవాన్లు తెలిపారు. ఇతనికి బొంత అర్జున్(16), శివ(14) కుమా రులు, భార్య లక్ష్మి, తల్లి పాపులమ్మ, తండ్రి నడిపి వెంకటయ్య ఉ న్నారు. కుమారుడి మృతి చెందడం పట్ల తల్లి ఆవేదనతో కుంగి తీవ్ర అస్వస్థతకు గురైంది. ఈ కార్యక్రమంలో కొమరోలు పోలీసులు ఎస్ఐ నాగరాజు, సైనిక్ సర్పంచి రమణారెడ్డి పాల్గొన్నారు.



లక్ష్మీ ప్రియను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విజేతకు అభినందనలు

ప్రజాశక్తి -వేటపాలెం

ఏలూరు నగరంలో ఈ నెల 1 నుంచి 3 వరకూ నిర్వహించిన 69వ అండర్-17 తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో వేటపాలెం బాలికోన్నత పాఠశాల విద్యార్థిని యార్లగడ్డ లక్ష్మీప్రియ ప్రతిభ చాటింది. 48-52 కిలోల విభాగంలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించి తతీయ స్థానం సాధించి కాంస్య పతకం అందుకుంది. కాంస్య పతకం సాధించిన లక్ష్మీప్రియకి పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని మంగళవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సరోజిని మాట్లాడుతూ గ్రామీణ పాఠశాలల విద్యార్థులు కష్టపడి రాష్ట్రస్థాయి స్థాయిలో ప్రతిభ కనబరచడం గర్వకారణమని తెలిపారు. పీడీలు జె. దేవబిక్షం, జె. శ్రావణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు లక్ష్మీప్రియను అభినందించారు.



విజేతలతో ఉపాధ్యాయులు

చందలూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పంగులూరు

ఒంగోలులోని డిఆర్ఎంఎం హైస్కూల్‌లో ఈనె 3న 69వ ఎస్ జి ఎఫ్ జిల్లాస్థాయి చెస్, యోగ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచారు. ఎస్ జిఎఫ్ బాపట్ల జిల్లా సెక్రెటరీ ప్రతిమ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి 150 మంది, యోగ పోటీలకు 120 హాజరైనట్లు ప్రతిమ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెస్ పోటీల్లో అండర్- 14 విభాగంలో చందలూరు హైస్కూల్ విద్యార్థి కే.సమిత్ నాయుడు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రతిమ తెలిపారు. యోగా అండర్- 14 విభాగంలో నాయపాము శతి ట్రెడిషనల్ లో ఆర్టి స్టిక్ సింగిల్ ఆర్టి స్టిక్ పేర్ లో మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. కే. హెప్సిబా, అమూల్య రిదమిక్ పెర్‌లో మొదటి స్థానం సాధించారు. అండర్- 14 బాలుర విభాగంలో ఎం. వెంకటేష్ ట్రెడీషనల్ ఆర్టిట్రిక్ సింగిల్ లో మొదటి స్థానం సాధించాడు. అండర్ -17 విభాగంలో ఎన్. భవ్య శ్రీ, ఏ. లిఖిత, ట్రెడిషనల్, ఆర్టిస్టిక్ లో మొదటి స్థానం సాధించినట్లు ఆమె తెలిపారు. ఆర్టి స్టిక్ ఫేర్ లో ఎన్. రత్నకుమారి, ఎన్. భవ్యశ్రీలు మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చందులూరి గిరిజ, పిడీ మధు, పిఇటి రవి, పాఠశాల ఉపాధ్యాయులు ,సిబ్బంది, అభినందనలు తెలిపారు.

బియ్యం అందజేత

ప్రజాశక్తి-వేటపాలెం

జీవీకేసీ స్వామి దయానంద సరస్వతి సేవాశ్రమం విద్యార్థులకు మరొక వెలుగు చేరింది. సేవాశ్రమం ద్వారా విద్యాభ్యాసం కొనసాగిస్తున్న విద్యార్థుల పరిస్థితులు, అందుతున్న సేవల గురించి తెలుసుకున్న చీరాల వాస్తవ్యులు డాక్టర్ సూర్యదేవర ఉమా మోహన్ , ఆయన సతీమణి నిరుపమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆశ్రమానికి ఆరు ట్యూబ్‌లైట్లు, రెండు ఫ్యాన్లు, బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, సేవక్ సుబ్రహ్మణ్యం, లక్ష్మీ, ద్దాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైన్సు సంబరాలు

ప్రజాశక్తి-బాపట్ల

చెకుముకి టాలెంట్ టెస్ట్ సైన్స్ పట్ల ఆసక్తి, శాస్త్రీయ దక్పథంతో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని మున్సిపల్ హై స్కూల్ హెచ్ఎం బి. రాజశ్రీ తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ హైస్కూల్లో 8, 9, 10 తరగతి విద్యార్థుల సైన్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టాలెంట్ టెస్టులో విద్యార్థులు తమ ప్రతిభను కనపరచి పరీక్షలో ఫిజిక్స్, కెమిస్ట్రి, బయాలజీ, ఆధునిక శాస్త్రీయ అంశాలు విద్యార్థుల విజ్ఞానాన్ని మరింత అభివద్ధి చేసే ప్రశ్నలు ఉంటాయన్నారు. పరీక్షకు విద్యార్థులు చర్చించి, ప్రతిభ ఆధారంగా రాష్ట్ర స్థాయిలో శాస్త్రవేత్తలతో సమావేశాలు, విజ్ఞాన విహార యాత్రల వంటి ప్రత్యేక అవకాశాలు విద్యార్థులకు లభిస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు వై. భాస్కరరావు, మండల ఉపాధ్యక్షులు పివి. ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానాన్ని సాధించారు. చందలూరు హైస్కూల్ కు చెందిన 10వ తరగతి విద్యార్థి యువి. గీత్ చరణ్ , ఎనిమిదో తరగతి విద్యార్థిని రవి లీల , 9వ తరగతి విద్యార్థి వి. సిరి బృందం ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమేపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రావి శ్రీనివాసరావు, ఆరే శ్రీనివాసరావు, పి. కాలేషా వలి, ఎస్. దుర్గాప్రసాద్, బి .మేరీ శ్యామల, కే. శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఇంకొల్లులోని ఎన్ఆర్అండ్ వివిఎస్ఆర్ బాలికల హైస్కూల్‌లో 8,9,10 తరగతి విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. టాలెంట్ టెస్టు మండల పరిధిలోని పావులూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన గుంజి వైష్ణవి బందం ప్రథమ స్థానంలో ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయికి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఇఒ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరికినపల్లి సత్య నారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు. గంగవరంలోని వలేటి కష్ణయ్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలు యుటిఎఫ్ నాయకులు షేక్ మస్తాన్ వలి, యు.చెంచయ్య, వల్లేటి విజయలక్ష్మి, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.నాగేశ్వరి వ్యవహరించారు.

వేటపాలెం : వేటపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభా కిరీటం అందుకున్నారు.జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాల సందడిలో భాగంగా వేటపాలెంలో మండలస్థాయి పోటీలు మంగళవారం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కనపర్తి మాల్యాద్రి, మండల అధ్యక్షుడు కాల్వ సోమశేఖర్ చెకుముకి ప్రశ్నాపత్రాలన ఆవిష్కరించారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్ల నుంచి 8, 9, 0వ తరగతుల విద్యార్థులు బందాలుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజ్ఞానవేదిక సభ్యులు రూపొందించిన ప్రశ్నాపత్రం విద్యార్థుల్లో శాస్త్రీయ చింతనను ప్రేరేపించేలా ఉండటమే కాకుండా, సైన్సుపై ఆసక్తి పెంచేలా ఉందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. బాలికోన్నత పాఠశాల విద్యార్థులు శశాంక్, అనుదీపక్, నవ్యలక్ష్మి బందం అద్భుత ప్రతిభ కనబరచి ప్రథమ స్థానం సాధించింది. ఈనెల 23న నిర్వహిస్తున్న జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు వీరు అర్హత సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజిని మాట్లాడుతూ తమ విద్యార్థులు విజ్ఞాన వేదిక పోటీల్లో ప్రతిభ చూపించడం గర్వకారణమన్నారు. జెవివి నాయకలు విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదదితరులు పాల్గొన్నారు. .



రేపల్లెలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

అద్దంకి : మండల పరిధిలోని కాకానిపాలెం ఉన్నత పాఠశాలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సంబరాలు నిర్వహించారు. ఎంఇఒ కెవి. శ్రీనివాసరావు పరీక్ష పత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురవయ్య , జెవివి డివిజన్ బాధ్యులు బివి.రత్నం , మండల బాధ్యులు బి.చంద్రశేఖర రావు ,యల్ .శ్రీనివాసరావు, ఎఎస్ఆర్. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బాపట్లలో ప్రశ్న పత్రాలను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

రేపల్లె : స్థానిక మున్సిపల్ హైస్కూల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణ స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞాన విజ్ఞాన వేదిక బాపట్ల జిల్లా గౌరవాధ్యక్షుడు ఇంకొల్లు రంగారావు మాట్లాడుతూ మున్సిపల్ స్థాయిలో ఆంధ్ర రత్న మున్సిపల్ స్కూల్ ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ప్రైవేట్ స్కూళ్ల విభాగంలో ఎస్ఎన్‌బిటిఎం టెక్నో స్కూల్ ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : విద్యార్థులలో సజనాత్మకతను వెలికి తీసి సైన్స్ పట్ల మక్కువ కలిగించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు దోహదం చేస్తాయని గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోనేటి కవిత అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. గుళ్ళ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో పొన్నపల్లి హెూలియర్ వరల్డ్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం, మేరీ రోజ్ బర్డ్స్ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు విశ్రాంత ఉపాధ్యాయుడు కె. రోశయ్య బహుమతులు అందజేశారు. ఈ పోటీలను జన వేదిక జిల్లా నాయకులు కాటూరి నాగేశ్వరరావు, కుంచా వెంకట రామ మోహన్ రావు, నడకుదురు చంద్రశేఖర రావు, వాకా శ్రీనివాసరావు, శ్రీనివాసరావు కళ్యాణ్ తదితరులు పర్యవేక్షించారు.

శిశుమరణాల నివారణపై ప్రత్యే దృష్టి

ప్రజాశక్తి - చీరాల

చిన్నపిల్లల్లో తరచుగా వచ్చే అనారోగ్య సమస్యలను ముందుగా గుర్తించి తగు చర్యలు తీసుకుంటే శిశుమరణాలను గణనీయంగా తగ్గించవచ్చని గుంటూరు ప్రాంతీయ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శిక్షణా కేంద్ర ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మాలిని తెలిపారు. చీరాల పట్టణంలోని మరియమ్మపేట, పాపిరాజుతోట ,వైకుంఠపురం ఆరోగ్య కేంద్రాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి బాలింతలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ మాలిని మాట్లాడుతూ పుట్టిన పుట్టిన తర్వాత తొలి ఏడు రోజులు అత్యంత కీలకమని తెలిపారు. ఎక్కువ శిశుమరణాలు ఈ కాలంలోనే చోటు చేసుకుంటాయని తెలిపారు. సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి తగు జాగ్రత్తలు తీసుకుంటే శిశు మరణాల రేటును తగ్గించవచ్చని తెలిపారు. మహిళా ఆరోగ్య కార్యకర్తల ప్రమోషన్ కోసం త్వరలో ఎల్‌హెచ్‌వి శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆశా వర్కర్లకు, ఎఎన్ఎంలకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇచ్చి శ్వాసకోశ వ్యాధులు, డయేరియా, పోషకాహార లోపం లాంటి సమస్యలను అధిగమించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సిహెచ్. నాగేశ్వరరావు, కె. చంద్రశేఖర్, వివి. శ్రీరామమూర్తి, బి. శివసామి రెడ్డి, ఎస్. రమణారావు, వి. రేణుక, చింతారావు బాబు, సౌరమ్మ, మధుమూర్తి, పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ శిరీష, డాక్టర్ ఎస్. ప్రణయ్,డాక్టర్ వై. యాకబ్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారి మెడికల్ రిపోర్టులు పరిశీలిస్తున్న డాక్టర్ మాలిని

అనిత కుమారి రాజన్‌కు ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు

ప్రజాశక్తి- కొల్లూరు

2025-26 సంవత్సరానికి ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డుకు కొల్లూరు ఫోర్ ఫ్రంట్ స్కూల్ ప్రిన్సిపల్ అనిత కుమారి రాజన్ ఎ ం వి క య్యా రు . ముంబైలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఘనంగా సత్కరించి అవార్డును అందజేశారు. ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థులు, యువ విద్యార్థులు రాణించేలా ప్రోత్సహించి అవిశ్రాంత నిబద్ధతతో కషి చేసినందుకు గానూ ఆమెకు ఇండియన్ టాలెంట్ 2025-26 అవార్డును అందజేశారు. పాండిచ్చేరి మాజీ లెఫ్‌నెంట్ గవర్నర్ మరియు మొదటి మహిళా ఐపిఎస్ అధికారిని డాక్టర్ కిరణ్ బేడీ మరియు ఒలంపిక్ పథక విజేత , బ్యాడ్మింటన్ ఛాంపియన్ సైనా నెహ్వాల్ చేతుల మీదగా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అనితకుమారి రాజన్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు



అవార్డులో అనిత కుమారి

'మీకోసం' అర్జీల పరిశీలనే ప్రథమ పని

అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రతిరోజూ కార్యాలయానికి రాగానే 'మీకోసం' అర్జీల స్టేటస్ పరిశీలించటమే ప్రథమ పనిగా పెట్టుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులకు స్పష్టం చేశారు. మీకోసం అర్జీలు పరిష్కారం అవుతున్న తీరుపై సంబంధిత విభాగ అధికారులతో మంగళవారం ప్రకాశం భవనంలోని తన చాంబర్‌లో ఆయన సమీక్షించారు. అర్జీల ఆడిట్, సకాలంలో పరిష్కారం, రీఓపెన్ కాకుండా చూడడం, అర్జీదారులతో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన ఆరా తీశారు. ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీ, విద్య, రోడ్లు భవనాల శాఖలకు సంబంధించిన అర్జీలు పెండింగ్‌లో ఉంటున్నట్లు మీకోసం విభాగ జిల్లా నోడల్ ఆఫీసర్ మాధురి ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అర్జీలను పరిష్కరించడంలో జాప్యం చేస్తున్న హనుమంతునిపాడు, పుల్లలచెరువు తాసిల్దారులతో కలెక్టర్ అప్పటికప్పుడే ఫోన్‌లో మాట్లాడారు. డిపిఒ ఎం. వెంకటేశ్వరరావు, జిల్లా విద్యా శాఖాధికారి ఏ.కిరణ్ కుమార్, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ రవి నాయక్‌ను తన ఛాంబర్ కు పిలిపించి అర్జీల పరిష్కారంలో జాప్యం ఎంత మాత్రం సరికాదని స్పష్టం చేశారు. సమావేశంలో 'మీకోసం' అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ కృష్ణమోహన్, సూపరింటెండెంట్ నాగజ్యోతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులను వినియోగించుకోండి

క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇంటి పన్నులను డిజిటల్ లావాదేవీల రూపంలో చెల్లించే సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను మంగళవారం ప్రకాశం భవనంలోని తన చాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి పన్ను చెల్లింపు విధానంలో పారదర్శకత, వేగం, ఖచ్చితత్వాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. స్థానిక సంస్థల్లో పారదర్శకతను పెంచేందుకు అమలు చేస్తున్న ఈ విధానాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

4196 బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పొగాకు కొనుగోళ్లు, ధరలు గణనీయంగా తగ్గుతున్నాయి. మంగళవారం నాడు రెండు రీజియన్ల పరిధిలో 4196 బేళ్లు(45 శాతం) తిరస్కరించారు. ఈ రోజు రెండు రీజియన్స్ పరిధిలో 11962 బేళ్ల ఆక్షన్ కి రాగా 7746 బేళ్లు మాత్రమే అమ్ముడుపోయాయి. నల్ల రేగడి నేలల పరిధిలోని ఒంగోలు 1, 2, వెల్లంపల్లి, టంగుటూరు, కొండపి వేలం కేంద్రాల్లో 6388 బేళ్ల ఆక్షన్ కు తేగా 4,175 బేళ్లు కొనుగోలు చేసారు. ఇక్కడ 2215 (35 శాతం) బేళ్లు తిరస్కరించారు. కిలో రూ కనిష్ట ధర రూ.50కు దిగజారింది. కాగా గరిష్ట ధర రూ.355 పలికింది. సగటున కిలో రూ.160.72 పైసలు పలికింది. కాగా లైట్ సాయిల్ పరిధిలో పొదిలి, కనిగిరి,కందుకూరు 1,2 కలిగిరి,డిసి పల్లి కేంద్రాల్లో 5574 బేళ్ల ఆక్షన్‌కు తేగా కేవలం 3593 బేళ్లు కొనుగోలు జరగ్గా 1981 (35 శాతం) బేళ్లు తిరస్కరించారు. ఇక్కడ కూడా కిలో గరిష్ట ధర రూ.355 కాగా కనిష్ట ధర రూ.50కు దిగజారింది. సగటున కిలో రూ.153.11 కు పడిపోయింది.

బాపట్లలో భారీ వర్షం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్లలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం మంగళవారం దంచి కొట్టింది. మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు తేరుకు ఒక ముందే లోతట్టు ప్రాంత ప్రజలకు వర్షం నీటితో కష్టాలు మొదలయ్యాయి. పట్టణంలో పలు పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులపై మోకాలు లోతు వర్షపు నీరు నిలిచింది. ప్రధానంగా ప్యాడిసన్ పేట జగనన్న కాలనీ, గంగపుత్ర కాలనీ వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి.

ఎస్‌సి, ఎస్‌టి సెల్‌కు డీఎస్పీలను నియమించాలి

దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌సి, ఎస్‌టి సెల్, స్పెషల్ బ్రాంచ్ లకు డిఎస్‌పిలను నియమించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాగేంద్రరావు మాట్లాడుతూ,స్పెషల్ బ్రాంచ్‌ను ని ప్రక్షాళన చేయాలని, గుంటూరు ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి స్పెషల్ బ్రాంచ్ సిఐ రాఘవేంద్రను విఆర్(వేకెన్సీ రిజర్వ్)కు పంపటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి సెల్కు, స్పెషల్ బ్రాంచ్‌కు డిఎస్‌పిలను నియమించాలని కోరారు.

నగర సుందరీకరణ కంటే

ముంపు నివారణ ముఖ్యం

- తుపాన్ బాధితులందరికీ సాయం అందాలి...
- నేడు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సామూహిక రాయబారం..
- సిపిఎం నగర కమిటీ పిలుపు



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

నగర సుందరీకరణ పేరుతో కోట్లాది అమృత్-2 నిధులతో కాంట్రాక్టర్లకు జేబులు నింపే ప్రక్రియను పక్కనబెట్టి ఒంగోలు నగర ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని, మొంథా తుఫాన్ బాధితులందరికీ సాయం అందించాలని సిపిఎం డిమాండ్ చేసింది. మంగళవారం నాడు స్థానిక సుందరయ్య భవన్‌లో ఆపార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు జి రమేష్, తంబి శ్రీనివాసులు, సయ్యద్ హుస్సేన్ తో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల నగరం మొత్తం కకావికలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెల్లడించిన తుఫాన్ నష్టం వివరాలు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అధికారుల నివేదిక ప్రకారం పోతురాజు కాలువ పరివాహక ప్రాంతం, నల్లవాగు ఐరువైపులా 15 డివిజన్ల పరిధిలో 54 కాలనీల్లో 25 శాతం ప్రజలు అనగా 50 నుంచి 60 వేల మంది ముంపుకు గురైనట్లు, ప్రతి కుటుంబం నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు, విద్యార్థుల బుక్స్, వంటివి పోగొట్టుకుని సగటున రూ, 10 వేల వరకు నష్టపోయారని తెలిపారు. అయితే జిల్లావ్యాప్తంగా కేవలం 9,051 కుటుంబాలకు మాత్రమే నష్టం నమోదు చేయడం పట్ల తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. కంటితుడుపు ఎన్యుమరేషన్ చేపట్టి పునరావాస కేంద్రాల్లో ఉన్నవారిని పరిగణలోకి తీసుకుని అంచనా వేయడం తగదన్నారు. నగరంలో సమగ్ర సర్వేచేపట్టి ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువులు, రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. తుఫాన్ బాధితుల పక్షాన బుధవారం ఉదయం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సామూహిక రాయబారం నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. తుఫాన్ మిగిల్చిన అపార నష్టాన్ని సకాలంలో అంచనా వేసి బాధితులందరికీ తక్షణ సాయం అందించడంతో పాటు శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది.

పోస్టల్‌లో సర్వర్ డౌన్..

రెండు రోజులుగా సేవలకు అంతరాయం..



సర్వర్ డౌన్ అయినట్లు వినియోగదారులకు చెబుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పోస్టల్ శాఖలో సాంకేతిక లోపం అయితేనేమీ.. టెలికం సర్వీస్ ప్రొవైడర్‌లో తలెత్తిన లోపమో.. గత రెండు రోజు లుగా పోస్టల్ శాఖలో ఆన్‌లైన్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ కారణంగా ఒంగోలు హెడ్‌పోస్టు ఆఫీస్‌తో సహా నగరంలోని పలు బ్రాంచి కార్యాలయాల్లో ఆన్ లైన్ సేవలు నిలిచిపోయాయి. ముఖ్యంగా వ్యక్తుల వారీగా స్పీడు పోస్టు, పార్సెల్, పోస్టల్ ఆర్డర్ కొనుగోళ్లు, సేవింగ్స్ బ్యాంకు లావాదేవీలు, పోస్టల్ ప్రావిడెంట్ ఫండ్, ఆర్‌డిలు, టైమ్ డిపాజిట్, సీనియర్ సిటిజన్ సేవింగ్ సర్వీస్, సుకన్య సమృద్ధి యోజన, వంటి లావాదేవీలు నిలిచిపోయాయి. ఉద్యోగులకు నెల ప్రారంభంలోనే జీతాలు, పెన్షన్లు అందుతాయి. సాధారణంగా ఉద్యోగులు, పెన్షనర్లు పోస్టల్ శాఖలో పొదుపు చేసుకునే ఆనవాయితీ. పోస్టల్ ఏజెంట్లు మొదటి వారంలోనే తమ చందాదారుల నుంచి నెల నెల డిపాజిట్ వసూలు చేసి పోస్టు ఆఫీసులో జమ చేయడం జరుగుతుంది. గత రెండు రోజులుగా ఈ తరహా లావాదేవీలు రోజుకు 500 నుంచి 1000 వరకు నిలిచిపోయినట్లు అంచనా. ఇదిలా ఉండగా ప్రతిరోజూ 100 నుంచి 200 వరకు పోస్టు ఆఫీసు నుంచి అందించే ఆధార్ సేవలు కూడా నిలిచిపోయాయి.

సర్వర్ డౌన్ కావడంతో ఇబ్బంది శ్రీనివాసరావు, హెడ్ పోస్టుమాస్టర్

సర్వర్ డౌన్ అవడం వల్ల వినియోగదారులతో పాటు సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. నెట్‌వర్క్ సమస్య ఒంగోలుకే పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగా ఈ సమస్య ఉన్నట్లు తెలిసింది.

డిఆర్‌సికి

సమగ్ర సమాచారంతో సన్నద్ధంకండి

అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా సమీక్ష కమిటీ (డిఆర్‌సి) సమావేశానికి పూర్తిస్థాయి సమాచారంతో సన్నద్ధం కావాలని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. ఈనెల ఏడో తేదీన డిఆర్‌సి సమావేశం ఉన్న నేపథ్యంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి వివిధ విభాగాల ఉన్నతాధికారులతో మంగళవారం ప్రకాశం భవనంలోని తన చాంబర్లో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో జిల్లా మంత్రి, ఎంపి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తయారు చేయడంపై చర్చించారు. జిల్లాలో ఇటీవలి మొంథా తుపాన్ ప్రభావం, వివిధ రంగాలలో నష్టం, వాటి అంచనాల రూపకల్పన వంటి అంశాలపై పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి సిద్ధం కావాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి వై.గోపీచంద్, ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాసులు, జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జోసఫ్ కుమార్, జిల్లా విద్యా శాఖాధికారి ఏ.కిరణ్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ రవి, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి రజనికుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పరిధిలో పోలీస్ సిబ్బందికి, వివిధ కళాశాలు, పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డిబేట్ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ నగదు బహుమతులను మరియు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరులకు నివాళిగా వారి త్యాగాలను యువతకు పరిచయం చేయడానికి నిర్వహిస్తున్న ప్రేరణాత్మక కార్యక్రమాల్లో వ్యాసరచన పోటీలు ముఖ్యమైన భాగమని అన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ కె. శ్రీనివాసరావు, ఆర్ఐలు రమణ రెడ్డి, సీతారామిరెడ్డి, డి.సురేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రకాశం జిల్లా పోలీస్ శాఖలో స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దూదేకుల మాబు సుభానీ 2024 అక్టోబర్ 19న చీమకుర్తి వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మరణించారు. తోటి కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక చేయూతగా 2020 బ్యాచ్‌కు చెందిన పోలీసు సిబ్బంది మరియు స్పెషల్ పార్టీ, స్పాట్ టీమ్, పి.యస్.ఒ లు, ఎ.ఆర్ సిబ్బంది స్వచ్ఛందంగా సేకరించిన రూ.2,46,000ను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ కె. శ్రీనివాసరావు, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, డి.సురేష్, సిబ్బంది, మరణించిన సుభానీ తండ్రి దూదేకుల వల్లి, తమ్ముడు శేషావల్లి పాల్గొన్నారు.

ఎస్ఐ అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం

ఒంగోలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని రాష్ట్ర డీజీపీ, జిల్లా ఎస్పీలు పదేపదే సూచనలు ఇస్తున్నా, తాళ్లూరు ఎస్సై మల్లికార్జున ఫిర్యాదుదారుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నట్లు మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ ఆరోపించారు. మంగళవారం ఒంగోలులో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎంఎస్ పి ఆధ్వర్యంలో తాళ్లూరు మాదిగలు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కార్యక్రమంలో బహుజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తొరటి ఆనంద్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గర్నెపూడి యెహోవాను మాదిగ, ఎంఎస్‌పిఎస్ ప్రతినిధులు గద్దె త్యాగరాజు, పొగడ్త నారాయణ, కే. బుజ్జి, అనపర్తి కోటేశ్వరరావు, జాషువా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

జిల్లావ్యాప్తంగా 36 టీములతో స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్ సిఐ శ్రీకాంత్

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కోరారు. ప్రజల భద్రత, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు మరియు సుదూర ప్రయాణీకుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పాఠశాల బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, లారీలు, వ్యాన్లు తదితర వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాహనాల పత్రాలను పరిశీలించారు. ప్రజల మరియు విద్యార్థుల ప్రయాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఆన్‌లైన్ విచారణ పేరుతో వసూలు

- తవ్వే కొద్దీ వెలుగు చూస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అవినీతి బాగోతం

ప్రజాశక్తి- రేపల్లె

ఆయన కార్మికశాఖ అధికారి. కాయ కష్టం చేసుకుని జీవించే కూలీల సంక్షేమం కోసం నియమించబడిన అధికారి. అయితే అవినీతి మత్తులో తూలుతూ కనపడిన చోటల్లా బెదిరింపులకు పాల్పడుతూ లక్షలు వసూలు చేస్తున్నాడు. ఆన్‌లైన్ విచారణ, చైల్డ్ లేబర్ కేసులు పేరుతో బ్లాక్‌మెయిల్ చేసి లక్షల రూపాయలు దండుకుంటున్నాడు. రేపల్లె కార్మిక శాఖకు 2019 నుంచి రెగ్యులర్ లేబర్ ఆఫీసర్ లేకపోవడంతో ఇన్‌ఛార్జులతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఈ క్రమంలో జి.ప్రభాకర్‌రావు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా నియమితులయ్యాడు. అప్పటి నుంచి ఆయన తన పనులు పక్కన పెట్టి అవినీతి సంపాదన వైపు కన్నేశారు. 2019 నుంచి 2025 వరకు భవన నిర్మాణ రంగంలో 1300కు పైగా కార్మికుల కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. కార్మికులు ప్రతిరోజూ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగిపోయేలా తిరుగుతున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రభాకర్ రావుకు జాలి దయ కలగడం లేదు. కనీసం కార్మికులకు సమాధానం చెప్పే ఓపిక కూడా లేదు. ఆయన ఇన్‌ఛార్జి లేబర్ ఆఫీసర్ కావడంతో గుంటూరు నుంచి ఎప్పుడో ఒకసారి వచ్చిపోతున్నాడు.



సహాయ కార్మిక అధికారి కార్యాలయం

మధ్యవర్తిగా నిజాం పట్ల మండలం పల్లభట్లకు సంబంధించిన సురేష్ అనే వ్యక్తిని నియమించుకుని అక్రమాలకు పాల్పడుతున్నాడు. డబ్బులు వ్యవహారంలో మీడియేటర్ గా సురేష్ ని ఉపయోగిస్తున్నాడు. రేపల్లె సబ్ డివిజన్లో ప్రైవేటు వైద్యశాలలను ఆసరాగా చేసుకొని ఆన్‌లైన్ విచారణ పేరుతో లక్షల కొద్దీ డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలిసినవి కొన్ని తెలియనివి ఇంకెన్నో అని కార్మికులు విమర్శిస్తున్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నాడు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులను కేసులు మీద కేసులు రాసి డబ్బులు దండుకుంటున్నాడు. బాలలకు రక్షణ కల్పించడం లేదు. లేబర్ చట్టాల ప్రకారం ఎవరైతే బాల కార్మికుల పనిలో మగ్గిపోతున్నారు. వారికి రక్షణ కల్పించాల్సిన లేబర్ ఆఫీసర్ చైల్డ్ లేబర్ కేసులు పెట్టి వేలకొద్దీ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రభాకర్‌పై చర్యలు తీసుకుని రేపల్లెకు లేబర్ ఆఫీసర్‌ను నియమించాలని ప్రజా ప్రతినిధులు, కార్మికులు ప్రజలు కోరుకుంటున్నారు.

దద్దుకూరులో నేత్రదానం

ప్రజాశక్తి- ఇంకొల్లు

మండల పరిధిలోని దద్దుకూరు గ్రామానికి చెందిన కోమటి బాలయ్య(91) వయోభారంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందాడు. బాలయ్య నేత్రాలను కారుణ్య దానం చేసి స్ఫూర్తిగా నిలిచారు. రాములమ్మ, కుమారులు ఆంజనేయులు, రాములు, కూతురు నేత్రదానం చేశారు. గుంటూరు పెద్దకాకానికి చెందిన శంకర్ నేత్ర వైద్యశాల వైద్యులు వచ్చి బాలయ్య కంటి కార్నియాలు సేకరించారు. కుటుంబ సభ్యులను నేత్ర వైద్యశాల వైద్యులు, ఇంకొల్లు రోటరీ అవయవ దాన కమిటీ సభ్యులు జట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహన్‌రావు, రోటరీ అధ్యక్ష కార్యదర్శులు బలగం కోటేశ్వరరావు, అలవల రాఘవరెడ్డి కార్యవర్గ సభ్యులు అభినందించారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న అధికారులు

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - పంగులూరు

మొంతా కారణంగా నష్టపోయిన చేనేత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా వచ్చిన నిత్యావసర వస్తువులను అధికారులు మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని కొండమంజులూరు గ్రామంలో59 చేనేత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు ,కేజీ పామ్ ఆయిల్, కేజీ బంగాళాదుంపలు, కేజీ ఉల్లిపాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు పి. సింగారావు మాట్లాడుతూ తుపాను కారణంగా నష్టపోయిన చేనేత కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకొచ్చినట్లు అన్నారు. పంచుమర్తి రాజ మాట్లాడుతూ తుపాను కారణంగా మగ్గాలు, న లు బూజుపట్టిపోయినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చేనేత కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్వేత, వీఆర్ఓ రవి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల వెంకటరావు, టిడిపి నాయకులు నాయకులు చింతల సహదేవుడు, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కందుల రామారావు, గోలి పూర్ణచంద్రరావు, పంచుమర్తి రాజా, పంచుమర్తి రాంబాబు, జనం హరిప్రసాద్, కే. శ్రీను, డి. బ్రహ్మజీ, డి. నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విత్తన యంత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మహిళా రైతుల సాధికారత కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా మార్టూరు మండలంలో అడ్వాంటా సీడ్స్ కంపెనీ ప్రతినిధులు మహిళా రైతులను ఎంపిక చేశారు. వారికి ఉచితంగా మొక్కజొన్న విత్తనాలు నాటే యంత్రాలను వ్యవసాయాధికారి లావణ్య మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ నూతన టెక్నాలజీ ద్వారా తయారైన ఈ యంత్రాల ద్వారా రైతులు విత్తనాన్ని సమయానికి విత్తుకోవడానికి సులభతరం అవుతుందన్నారు. శ్రమ వ్యయాన్ని తగ్గించడంతోపాటు దిగుబడి పెరుగుతుందని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఉన్న ఇతర కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చి అన్నదాతలకు నూతన యంత్రాలను అందించి అన్నదాతలకు అభివృద్ధికి తోడ్పడాలని ఎఒ కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేల్స్ మేనేజర్ రోహిత్ కుమార్, టెరిటరీ మేనేజర్ సుమంత్, డీలర్లు రైతులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- కొల్లూరు

కొల్లూరులోని ప్రజాసంఘాల కార్యాలయంలో యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కొల్లూరు మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా పి.పుష్పరాజు, డి.మేరీ ఫ్లోరెన్సు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి వినోద్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి

ప్రజాశక్తి -అద్దంకి

మండల పరిధిలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఆదేశాల మేరకు బిర్సా ముండా 151 జయంతి సందర్భంగా జన జాతీయ గౌరవం పఖ్వారా అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. గంగాధర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అడవి బిడ్డల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడిన మహాయోధుడు భగవాన్ బిర్సా ముండా అని తెలిపారు. ఆయన కేవలం 25 ఏళ్లకే అమరుడైనా ఆయన రగిలించిన పోరాట స్ఫూర్తి ఈనాటికీ సజీవంగానే ఉందన్నారు. ఈ కార్యక్రమం లో సిఆర్‌పి, విద్యార్థులు ఒకేషనల్ కోర్సు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న డాక్టర్ శివచెన్నయ్య

17 నుంచి గ్రామాల్లో సర్వే

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలో ఈనెల 17 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వే నిర్వహిస్తున్నట్లు పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కే. శివ చెన్నయ్య తెలిపారు. పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివచెన్నయ్య మాట్లాడుతూ రెండు వారాలపాటు సర్వే ఉంటుందన్నారు. ఆశా వర్కర్లు కుష్టు రోగం ఉన్న వారిని గుర్తించాలన్నారు. సర్వే నిర్వహించే సమయంలో ఇళ్లను గుర్తించడానికి ఉపయోగించే గుర్తులు విధానం మరియు కుష్టురోగ లక్షణాల గురించి డాక్టర్ శివ చెన్నయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో కుష్టు రోగ కార్యక్రమ అధికారి ప్రదీప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి. భారతి, హెల్త్‌సూపర్ వైజర్ భానుమతి, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, ఎంఎల్ హెచ్ పిలు పాల్గొన్నారు.

అధికారుల కృషి అభినందనీయం

ప్రజాశక్తి - నిజాంపట్నం

ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ తుపాను సమయంలో అధికారులు అందించిన సేవలకు ప్రతి ఒక్క అధికారికి అభినందనలు తెలిపారు. ఎంపిపి మోపిదేవి విజయనిర్మల. జడ్‌పిటిసి నర్రాసుబ్బయ్య మాట్లాడుతూ తుపాను సందర్భంగా మండల స్థాయి అధికారుల నుంచి గ్రామస్థాయి అధికారి వరకూ చాకచక్యంగా విధులు నిర్వహించారని తెలిపారు. ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా కృషి చేశారని తెలిపారు. రాత్రి సమయంలోనూ అధికారులు ప్రభుత్వ కార్యాలయంలో నివాసం ఉండి ప్రజలకు సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండల పరిధిలోని కొమ్మాలపాడు గ్రామంలో కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి టిడిపి ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మోతాదు బాషా ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ తెల్లప్రోలు రమేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీలు అభివృద్ధి కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ హఫీజ్, పంచాయతీరాజ్ ఎఇ నాగేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో నాయకులు

పంటలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి- మార్టూరు

మొందా తుపాన్ కారణంగా పంటలకు తీవ్ర నష్టం వాటిందిం. మండలంలో రైతులు మినుము 1050 ఎకరాలు, పత్తి 740 ఎకరాలు, మొక్కజొన్న 427 ఎకరాల్లో సాగు చేశారు. మినుము 773 ఎకరాలు, పత్తి 150 ఎకరాలు, మొక్కజొన్న 18 ఎకరాల్లో దెబ్బతిన్న ఎఒ లావణ్య తెలిపారు.పత్తికి ఎకరానికి రూ.10, 000, మొక్కజొన్న, మినుముకు ఎకరానికి రూ.6000 వంతున ప్రభుత్వం ప్రకటించింది సిబ్బంది కొరత కారణంగా ఎన్యుమరేషన్ సక్రమముగా జరగలేదని రైతులు పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని మండల రైతు సంఘ కార్యదర్శి వీరవల్లి కృష్ణమూర్తి తెలిపారు.



శ్రావణ ప్రియను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి- చెరుకుపల్లి

రేపల్లెలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మాడా శ్రావణప్రియ వక్తృత్వ, క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది . ఈ సందర్భంగా శ్రావణ ప్రియను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాటూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులు, పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈనెల 26న రాష్ట్ర రాజధాని అమరావతి లో రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా నిర్వహిస్తున్న మాక్ అసెంబ్లీకి శ్రావణ ప్రియ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తెలిపారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-అద్దంకి

వరిలో ఉల్లికోడు నివారణ చర్యలు తీసుకోవాలని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు బి, ఎఫ్రాయిం తెలిపారు. మండల పరిధిలోని ధర్మవరం మరియు శంఖవరప్పాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తొలుత వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకష్ణ, రైతులతో కలిసి వరి పంటను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎఒ కొర్రపాటి వెంకటకష్ణ మాట్లాడుతూ వరిలో ఉల్లికోడు నివారణ కోసం ఫిప్రోనిల్ 50 శాతం ఇసి ఎకరాకు 400 ఎంఎల్ వంతున పిచికారీ చేసుకోవాలన్నారు. తుపాన్ తరువాత వరిలో ఉల్లికోడు ప్రభావం ఎక్కువగా కనిపిస్తుందని తెలిపారు. దాని నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. తుపాను కారణంగా నష్టపోయిన రైతులు జాబితా అన్ని రైతు సేవా కేంద్రాలలో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించినట్లు తెలిపారు. రైతులు తమ పేర్లు సరి చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శేషయ్య, ఖాజాబీ, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, రైతులు పాల్గొన్నారు.

అమృతలూరు : మండల పరిధిలోని యాడవూరు మరియు కూచిపూడి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఎఒ ఎం. హేమంత్ భరత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు.



అద్దంకిలో మాట్లాడుతున్న

ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఈ క్రాప్ నమోదు నమోదుకు ఈనెల 8 వరకూ గడువు ఉన్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వరి పాలు పోసుకుని గింజలు గట్టిపడే దశలో ఉందన్నారు. వరిలో సుడిదోమ అధికంగా వ్యాప్తి చెందుతుందని, దాన్ని నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి. మణికంఠ , వ్యవసాయ ఉద్యానవన సహాయకులు ప్రవల్లిక , ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : వరి పైరులో కంకి నల్లి తెగులు మరియు పాము పొడ తెగులు కనిపిస్తుందని, వాటి నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కుంచాల వారి పాలెం, రాంబోట్లపాలెం గ్రామాలలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. తొలుత వరి పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఫారూఖ్, ఏఈఓ లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : వరి పంటకు ఆకు చుట్టు పురుగు ఆశించిందని, దాని నివారణకు క్లోరో ఫైరీఫాస్ లేదా ఎసిఫేట్ కార్బఫ్ హైడ్రోక్లోరైట్ మందులు అవసరాన్ని బట్టి తగిన మోతాదులో ఉపయోగించాలని ఎఒ డి. సుబ్బారెడ్డి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రామకూరు, భగవాన్ రాజుపాలెం గ్రామాల్లో పంటలను పరిశీలించారు.అనంతరం రైతులతో మాట్లాడారు. వరి పైరు నాటే ముందు ఆకు చివరలు తుంచటం వలన తొలి దశలో వచ్చే పురుగులను నివారించవచ్చునని తెలిపారు. సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతుల ఉపయోగించి పంటల సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు హరి, బీబీజాన్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ సుచిత్ర

దత్తత సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-రేపల్లె

జాతీయ దత్తత మాసం- 2025ను పురస్కరించుకుని, మహిళా అభివద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రేపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ ఎం. సుచిత్ర ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపిఒ పురుషోత్తం, జిల్లా బాలల పరిరక్షణ అధికారులు కష్ణ , స్వప్న ప్రియ మాట్లాడుతూ దత్తతపై అవగాహన కల్పించారు. జాతీయ దత్తత నెల అవగాహన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిడిపిఒ సుచిత్ర మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే దత్తత తీసుకోవాలన్నారు. సంతానం లేని దంపతులు పిల్లలను దత్తత తీసుకొని, వారికి మంచి జీవితాన్ని ఇవ్వాలని కోరారు. దత్తత మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారానే జరగాలన్నారు. ఈ విధానంపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ కష్ణ, సూపర్‌వైజర్ హిమ బిందు, సునీత, రాధిక, విజయలక్ష్మి, మంజుల, నాగలక్ష్మి. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడిలో ఆశా డే

ప్రజాశక్తి - యద్దనపూడి

యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సందర్భంగా ఎఎన్‌ఎంలు, ఆషా వర్కర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి డాక్టర్ శ్రీ హర్ష మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది కేన్సర్ స్క్రీనింగ్,బాలింతల ఆరోగ్యం, ఫ్లోరోసిస్ అంశాలపై పనిచేయాలని సూచించారు. ఈ నెల 17 నుంచి కుష్ఠువ్యాధిగస్తులను గుర్తించేందుకు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కుష్ఠు వ్యాధి నివారణపై ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ చంద్రశేఖర్, హెచ్‌వి సునంద,ఆరోగ్య సిబ్బంది చంద్రశేఖరరావు ,హనుమంతరావు, ఎంఎల్‌హెచ్‌పిలు సుకన్య, మధుబాల, షర్మిల, రేణుక, ఎఎన్‌ఎంలు సలోమి,రజిత, జ్యోతి, సులోచన, దుర్గ, నూరజహాన్, షకీలా, అనంత లక్ష్మి, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

బాధితుడికి వైసిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి- ఇంకొల్లు

విద్యుత్ డిఇ తీరునకు నిరసనగా చిన్న గంజాం గ్రామానికి చెందిన మార్పు బెన్ను సోమవారం కలెక్టర్ రేట్ వద్ద ఆత్మహత్యా ప్రయత్నం పాల్పడిన విషయం తెలిసిందే. బాధితుడు బాపట్ల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న వైసిపి పర్చూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి గాదె మధుసూదన్ రెడ్డి మంగళవారం బెన్నును పరామర్శించారు. ఓ వ్యక్తి తన భూమిని ఆక్రమించినట్లు బెన్ను తెలిపారు. అయితే ఆభూమిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు విద్యుత్ అధికారులు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఇదేమని విద్యుత్ డిఇ, అధికారులు చుట్టూ అనేక సార్లు తిరిగినా వారుపట్టించుకోనేదని ఆవేదన వ్యక్తం చేశారు. గంతర్యం లేక తాను పురుగుమందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడినట్లు తెలిపారు. దీంతో స్పందించిన మధుసూదన రెడ్డి అధికారులతో మాట్లాడి భూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చాడు. అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న గాదె మధుసూదన్ రెడ్డి

న్యాయపరంగా పోరాటం చేయాలని తెలిపారు. బెన్నును పరామర్శించిన వారిలో వైసిపి చిన్నగంజాం మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పల్నాటి ఏడుకొండలు మరియు వైసిపి నాయకులు ఉన్నారు.

తుపాను బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- చీరాల

తుపాను కారణంగా చీరాల నియోజకవర్గంలో రైతులు, చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోయారని, బాధితులకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని వైసిపి చీరాల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు కోరారు. చీరాల నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి తుపాను బాధితులను పరామర్శించారు. అనంతరం చీరాల ఆర్‌డీవో చంద్రశేఖర్ నాయుడును కలిసి తుపాను కారణంగా నీటమునిగిన పొలాలు, చెరువులు, మగ్గాల వివరాలను నిష్పక్షపాతంగా సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కోరారు. అనంతరం ఆర్‌డిఒ



వేటపాలెంలో చేనేత మగ్గాన్ని పరిశీలిస్తున్న కరణం



ఆర్‌డిఒతో మాట్లాడుతున్న కరణం వెంకటేష్ బాబు

వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో వైసిపి చీరాల,వేటపాలెం మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేటపాలెం : తుపాను రైతన్నలతో పాటు నేతన్నల జీవనాన్ని కూడా దెబ్బతీసిందని వైసిపి చీరాల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు తెలిపార. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలోని విఘ్నేశ్వర కాలనీలో తుపాను కారణంగా నీట మునిగిన చేనేత మగ్గాలు, గహాలను మంగళవారం పరిశీలించారు. శానిటైజేషన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలఅధ్యక్షుడు సాదు రాఘవ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

ప్రజాశక్తి- అద్దంకి

పుట్టపర్తి శ్రీ సత్య సాయి బాబా వారి శత జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక పుట్టపర్తి సాయి మందిరం వారి ఆధ్వర్యంలో మంగళవారం సివి స్ట్రీట్,(సత్రం బడి) మరియు కట్టకిందపాలెం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఉచిత దంత వైద్యశిబిరాలు నిర్వహించినారు. ఈ సందర్భంగా వారాహి దంతవైద్య శాల డాక్టర్స్ చెన్నుపల్లి భావనా ప్రియ దర్శిని, యామిని కష్ణ ప్రియాంక ఆధ్వరయంలో 106 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. అవసరైమన వారికి ఉచితంగా మందులు అందించారు. ఆయా కార్యక్రమాలోల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి.శ్యాం, ఎంవి.సుబ్బారావు, ఎంఇఒ- 2 కెవి. శ్రీనివాసరావు, సాయి సేవాదళ్ కన్వీనర్ చిన్ని శ్రీహరి, సభ్యులు చిన్ని ఉమాదేవి, అంజాద్ బాషా, చప్పిడి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

9న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- ఇంకొల్లు

ఇంకొల్లు మండలం గంగవరం గ్రామంలోని మంచాల వెంకటరామయ్య రంగమ్మ విద్యా వైద్య వైజ్ఞానిక కళ్యాణ మండపంలో ఈనెల 9న ఉచిత షుగర్ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ షుగర్ వైద్య నిపుణులు మంచాల రమేష్ బాబు, డాక్టర్ సాంబశివరావు, మంచాల విద్య వైద్య సేవలు అందినున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహక సభ్యుడు కరి బాలచంద్ర తెలిపారు. వైద్యశిబిరానికి క్రమ్మం తప్పకుండా వచ్చేవారు తమ ఆరోగ్యానికి సంబంధించిన నివేదిక పుస్తకంతో పాటు షుగర్ పరీక్షలకు సంబంధించిన రిపోర్టు తీసుకురావాలన్నారు. కొత్తవారు ఉదయం 6 గంటలకల్లా వస్తే అక్కడే షుగర్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బాల చంద్రర్ కోరారు.

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- అమృతలూరు

మండల కేంద్రమైన అమృతలూరు గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచి దేవరకొండ రాము ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య పనులను ఎంపీడీవో మారుతి శేషమాంబ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్మూలన పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. సర్పంచి రాము మాట్లాడుతూ వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదేశాల మేరకు మురుగునీటి కాలువలు, పల్లపు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తొలగించి అంటూ వ్యాధులు ప్రబల కండ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తాగునీటి ట్యాంకులలో క్లోరినేషన్ చేసి శుద్ధ జలం సరఫరా చేస్తున్నట్ల తెలిపారు. ప్రజలు కొన్ని రోజులపాటు కాచి చల్లార్చిన నీటిని వినియోగించడం వల్ల ంటువ్యాధులకు దూరంగా ఉండవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె. సాంబశివరావు, బిల్లు కలెక్టర్ రిజ్వాన్ బాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రియాజ్‌ను కలిసిన జనసైనికులు

ప్రజాశక్తి- సంతమాగులూరు

ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన అధ్యక్షుడు, ఒంగోలు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్‌ను మండల జనసైనికులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార దిశగా చర్చలు, పార్టీ బలోపేతం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేపడుతున్న అభివద్ధి కార్యక్రమాలను ఏ విధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి, జనసేన పార్టీని ఈ విధంగా బలోపేతం చేయాలి అనే విషయంపై చర్చించారు. రాబోయే రోజుల్లో కూటమి నాయకులతో కలిసికట్టుగా ఏ విధంగా పని చేయాలనే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు షేక్ మీరా, దిండు ప్రసన్నాంజనేయులు, రాంబాబు, కరుణాకర్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని

బస్సులను సీజ్ చేయండి..

- కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులు తనిఖీ చేయండి
- ఎంవిఐ, ఏఎంవిఐలకు డిటిసి ఆర్.సుశీల ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డిటిసి సుశీల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులు, స్కూల్ బస్సులను తనిఖీ చేయాలని ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల ఎంవిఐలు, ఏఎంవిఐలను ఆదేశించారు. మోటార్ వాహన చట్టం లోని నిబంధనలను పాటించని బస్సులను సీజ్ చేయాలని ఆదేశించారు. స్థానిక ఉప రవాణా కమిషనర్ ఛాంబర్‌లో మంగళవారం ఆమె మోటార్ వాహన తనిఖీ అధికారులు సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారులతో ప్రత్యేక సమావేశం మంగళవారం జరిగింది. డిటిసి మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల బస్సులను ప్రతి రోజు ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు, సాయంకాలం 3 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలన్నారు. భద్రతా నియమాలను పాటించని వాహనాలు, ప్రభుత్వానికి పన్నులు చెల్లించని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాటిని సీజ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రాంతీయ రవాణా శాఖాదికారి శ్రీచందన, మోటార్ వాహన తనిఖీ అధికారులు ఏ.కిరణ్ ప్రభాకర్, ఎల్.సురేంద్ర ప్రసాద్, సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారులు కె. జయప్రకాష్, యు. ధర్మేంద్ర, డి.జస్వంత్, పరిపాలన అధికారి ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సైన్స్ డ్రామా ద్వారా

విద్యార్థుల్లో విజ్ఞాన ప్రయోజనాలు

ప్రజాశక్తి-బాపట్ల

సైన్స్ డ్రామా ద్వారా విద్యార్థులు విజ్ఞాన సాంకేతిక ప్రయోజనాలతో సామాజిక అంశాలను నటన, కథన, రూప ప్రదర్శనతో విశాల దక్పథంతో ముందుకు వెళతారని డీఈవో ఎస్.పురుషోత్తం అన్నారు. దక్షిణ భారత స్థాయి విశ్వేశ్వరయ్య మ్యూజియం బెంగళూరు వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైన్స్ డ్రామాలో భాగంగా మంగళవారం జిల్లా స్థాయిలో విద్యార్థులకు సైన్స్ డ్రామా పోటీలను పట్టణంలో పబ్లిక్ స్కూల్లో నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన సైన్స్ డ్రామా విద్యార్థి బందం నవంబర్ 6 ,7 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరౌతారని జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణయితలుగా ఎన్.శ్రీమన్నారాయణ, కె.వై.రాజకుమారి వ్యవహరించారు. విజేతలైన విద్యార్థులను డిఈఓ పురుషోత్తం, నిజాంపట్నం మండల విద్యాశాఖ అధికారి శేషగోపాలం అభినందించారు.

తెలియక చేసిన తప్పులకూ

శిక్ష అనుభవించాల్సిందే..

ఖైదీలకు సూచించిన సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్



ఖైదీలకు పెట్టే భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పులకు శిక్ష అనుభవించాల్సిందేనని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ తెలిపారు. ఒంగోలు జిల్లా జైలులోని స్టోర్ రూమును వంటశాలను మంగళవారం న్యాయమూర్తి పరిశీలించారు. జిల్లా జైలులో ఖైదీలతో నిర్వహించిన కార్యక్రమంలో షేక్ ఇబ్రహీం షరీఫ్ మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకోలేని ఖైదీలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పద్ధతిలో ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అవసరం ఉన్న ప్రతి ఒక్క ఖైదీ వినియోగించుకొని ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి వీరరాఘవులు, జైలర్ మజ్జి అప్పలనాయుడు, డిప్యూటీ జైలర్ యలమందరావు జైలు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన: వైసీపీ



బాధితులను పరామర్శిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కొమ్మూరి కనకరావు మాదిగ ఆరోపించారు.మంగళవారం ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చీమకుర్తి మండలం బండ్లమూడి గ్రామానికి చెందిన కండ్లం ఏసుదాసు, రామయ్య, ఎలిశమ్మ తదితరులను పరామర్శించి పరిస్థితి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఎంపిపి యుద్దనపూడి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి బొట్ల రామారావు, బిసి విభాగం అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, తాతా నరసింహం గౌడ్, మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, గంగయ్య పాల్గొన్నారు.



వాడరేవు తీరం వద్ద కోతకు గురైన రహదారి

బీచ్..క్లోజ్..

- కార్తీక మాస స్నానాలకు భక్తులు రావద్దంటున్న అధికారులు
- తీరం వెంట కోతకు గురైన వంతెన, రహదారి

ప్రజాశక్తి-చీరాల, బాపట్ల

తుపాను ప్రభావంతో తీర ప్రాంత రహదారులు, వంతెన కోతకు గురై రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. తీరం వెంట ప్రమాదకరమైన గుంటలు ఏర్పడ్డాయి. దీంతో బాపట్లలోని సూర్యలంక, చీరాలలోని వాడరేవు, రామాపురం, చిన్నగంజాం తీర ప్రాంతాలలో సముద్ర స్నానాలు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పూర్తిగా నిషేధించినట్లు పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ పాటికే ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారికంగా ప్రకటనలను విడుదల చేశారు. ప్రధానంగా వాడరేవు రామాపురం తీర వెంట రహదారి పూర్తిగా కోతకు గురైంది. రామాపురం వద్ద ఉన్న ప్రధాన చప్ట తుఫాను దాటికి నీటిలో కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో వాడరేవు రామాపురం రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

ఎవరూ రావద్దు : డిఎస్పీ మోయిన్

తుఫాను ప్రభావం వలన బీచ్ రహదారులు కోతకు గురై సముద్రం వద్ద ప్రమాదకర గుంతలు ఏర్పడి ప్రమాదంగా మారాయని దీంతో తాత్కాలికంగా బీచ్ మూసివేసామని మరల పునరుద్దించేంతవరకు ఎవరు కార్తీకమాస భక్తులు పర్యాటకులు ఎవరు సముద్రం వద్దకు రావద్దని చీరాల డిఎస్పి మోయిన్ అన్నారు.

కార్తీక పౌర్ణమికి బీచ్‌లకు సెలవు

కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానాలకు పర్యాటకులను సూర్యలంక బీచ్ అనుమతించడం లేదని బాపట్ల ఆర్డీవో పి. గ్లోరియా తెలిపారు. సముద్ర తీరంలో గుంతలు ఏర్పడిన కారణంగా పర్యాటకుల భద్రత దృష్ట్యా బీచ్‌కు సెలవు ప్రకటించినట్లు ఆమె తెలిపారు.

హెచ్‌సిడిపితో బహుళ ప్రయోజనాలు

క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ విద్యాశంకర్ వెల్లడి



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ విద్యాశంకర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉద్యాన పంటల క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం (హెచ్‌సిడిపి)తో రైతులు, వ్యాపారులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ వై. విద్యా శంకర్ పేర్కొన్నారు. ఒంగోలు జిల్లా ఉద్యాన అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో ఉద్యాన పంటల క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమంపై రైతులు, వ్యాపారులు, యువ పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు, వర్క్‌షాప్ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఉద్యాన అధికారి వై.గోపీచంద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వై.విద్యా శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం హెచ్‌సిడిపి కార్యక్రమం అమలు చేస్తుందని, రైతులు, వ్యాపారులకు నేరుగా సబ్సిడీలు అందజేస్తుందన్నారు. ఓ పారిశ్రామిక వేత్త రూ.10 కోట్ల పెట్టుబడి పెడితే ఇందులో 40 శాతం రైతులకు ఖర్చు చేస్తామని చూపాలని, 20 శాతం పారిశ్రామిక వేత్త పంట పెట్టుబడి పెట్టాలని, మరో 20 శాతం బ్యాంకు రుణం తీసుకోవాలని, 20 శాతం కేంద్ర ప్రభుత్వం రాయితీలు అందిస్తుందన్నారు. హెచ్‌సిడిపి కార్యక్రమ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యా శంకర్ వివరించారు. రైతులు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తల అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాసులు, నాబార్డు డిడిఎం రవికుమార్, ఉద్యాన శాఖ అధికారులు, రైతులు, యువపారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, పలు ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాకుటూరివారిపాలెంలో ఉద్రిక్తత

- సర్పంచ్ వర్గీయులు టార్గెట్ చేశారని దళితుల ఆరోపణ
- ఆందోళనకు దిగిన దళితులు..
- గ్రామాన్ని సందర్శించి.. చర్చలు జరిపిన అధికారులు

ప్రజాశక్తి-టంగుటూరు, శింగరాయకొండ

టంగుటూరు మండలం, కాకుటూరివారిపాలెంలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. గ్రామాన్ని అభివద్ధి పథంలో తీసుకుపోవాల్సిన గ్రామ సర్పంచ్ తమను టార్గెట్ చేస్తున్నారని దళితులు ఆరోపిస్తున్నారు. ఎప్పుడో జరిగిన విషయాలను మనసులో పెట్టుకొని ఇబ్బందులు పెట్టడానికి చూస్తున్నారని దళితులు ఆందోళనకు దిగారు. అంబేద్కర్ విగ్రహం వద్ద పిల్లర్లు, రోడ్డు నిర్మాణం విషయంలో గ్రామస్తులు, దళితుల మధ్య వాదోపవాదనలు చోటుచేసుకున్నాయి. ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు రెండు గ్రూపులతో సాయంత్రం వరకు చర్చలు జరిపారు.

కాకుటూరివారిపాలెంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం పరిసర ప్రాంతాల్లో ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద గుంటను పూడ్చటానికి గతంలో సర్పంచి వర్గీయులు ప్రయత్నం చేశారు. ఆ కుంట పూడ్చితే పొలాల్లో నుంచి వర్షపు నీళ్లు దళిత కాలనీలోకి వచ్చి ఇబ్బందులు పడతామని దళితులు ఆ కుంటను పూడ్చకుండా అడ్డుకున్నారు.

ప్రస్తుతం సర్పంచ్ వర్గీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం మీదుగా కరెంటు స్తంభాలు వేస్తున్న సమయంలో దళితులు అడ్డుకున్నారు. కరెంటు స్తంభాలు వేసి రోడ్డును 40 అడుగులు వెడల్పు చేయాలని నిర్ణయం తీసుకోవడాన్ని దళితులు వ్యతిరేకించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం మీదగా కరెంటు స్తంభాలు వేయటం కుదరదని, అక్కడ విగ్రహానికి ఇబ్బందులు లేకుండా చూడాలని విన్నవించుకున్నారు. అటూఇటూ ఇబ్బందులు లేకుండా కరెంటు స్తంభాన్ని వేసి అక్కడ సమస్య ఇబ్బందులు లేకుండా చూశారు.

అయితే కుంట దగ్గర పిల్లర్లు వేసుకొని దళితులకు ఇబ్బందులు లేకుండా చేసుకోవాలనుకొని పిల్లర్ల నిర్మాణం చేపట్టి ఉండగా వాటిని గ్రామస్తులు అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. దీనికి గ్రామ పంచాయతీ అధికారులు సర్పంచ్ నేతత్వంలో పిల్లర్లు వేయకుండా వాటిని పగలగొట్టే ప్రయత్నాలు చేయడంతో ఏర్పడిన వివాదం ఉద్రిక్తత వాతావరణానికి దారితీసింది. అక్కడ ఉన్న అధికారులు పిల్లర్లు ఆపాలని హెచ్చరించడంతో దళితులు విగ్రహానికి ఇబ్బందులు వస్తాయేమో అన్న ఆలోచనతో అప్పటికే కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయడం జరిగింది. అయితే గ్రామస్తులు రోడ్డు నిర్మాణం కూడా వెడల్పు చేయాలని నిర్ణయించడంతో దళితులు స్థలాల మీదకి, ఇళ్ల మీదకి ఆ రోడ్డు వస్తుందని దీనిని దళితులు అడ్డుకున్నారు. సమస్య తీవ్రస్థాయికి చేరటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న టంగుటూరు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి.. అక్కడ రెండు గ్రూపులతో సమావేశమయ్యారు. అక్కడ నుంచి గ్రామంలో సమస్య తెలుసుకునేందుకు కాకుటూరువారిపాలెం వెళ్లి రెండు గ్రూపుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎలాంటి ఇబ్బందులూ లేవని, ఆ విగ్రహం జోలికి అధికారులు, గ్రామస్తులు ఎవరూ వెళ్లరని దళితులకు అధికారులు వివరించారు. రెండు గ్రూపుల నుంచి చెరో ఏడుగురిని తహశీల్దార్ కార్యాలయానికి రావాలని సూచించారు. దళితులు ఏడుగురు, గ్రామస్తులు మరో ఏడుగురు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి మాట్లాడుతున్న సమయంలో దళిత కాలనీ నుంచి వందలాది మంది అక్కడికి చేరుకున్నారు. గ్రామస్తులు ఏదో మనసులో పెట్టుకొని దళితుల్ని ఇబ్బంది పెడుతున్నారని దళిత కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో రెండు గ్రూపులతో సమావేశం నిర్వహించి.. మరోసారి అధికారులు, పోలీసుల సమక్షంలో గ్రామానికి వెళ్లి పరిశీలించారు.

కుంటని పూడ్చడానికి లేదని, పిల్లర్లను కొనసాగించాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు విషయంలో 40 అడుగులు గ్రామస్తులు ప్రతిపాదన కోరగా 30 అడుగులకు దళితులు రోడ్డు నిర్మాణానికి ఒప్పుకున్నారు. అయితే ఆ సమయంలో కొందరి ఇళ్ల మీదకి రోడ్డు వెళ్లడంతో కొందరు దళితులు అడ్డం తిరిగారు. అక్కడ నుంచి మరోమారు తహశీల్దార్ కార్యాలయంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇరు వర్గాలతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేవిధంగా ప్రయత్నించినప్పటికీ.. పూర్తిస్థాయిలో ఫలితం రాలేదు. సర్పంచి వర్గీయులు దళితుల్ని టార్గెట్ చేసే విధంగా రోడ్డు నిర్మాణాలు, కరెంటు పోల్స్ వేసే క్రమంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని దళితులు ఆరోపిస్తున్నారు. కెవిపిఎస్ నాయకులు వి.మోజెస్ గ్రామాన్ని సందర్శించి. దళితులతో మాట్లాడారు దళితులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చూడాలని ఈ సందర్భంగా సూచించారు. కొండేపి సిఐ జి.సోమశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.